# ఖాళీ కుర్చీలు.. చీకట్లో అవస్థలు

- రైతువేదికల్లో గందరగోళంగా రుణమాఫీ కార్యక్రమాలు
- సీఎం ప్రసంగం వినకుండానే వెనుదిరిగిన రైతులు

కరీంనగర్, జూలై 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు వేదికల్లో నిర్వహించిన 'రైతు నేస్తం రైతు రుణ మాఫీ-2024 నిధుల విడుదల కార్యక్రమాలు' గందరగోళంగా మారాయి. కొన్నిచోట్ల కరెంటు పోవడంతో రైతులు చీకట్లో అవస్థలు పడగా, మరికొందరు కార్యక్రమం ప్రారంభమైన కొద్దిసేపటికే వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. మరికొన్ని చోట్ల రైతులు లేక వేదికలు వెలవెలబోయాయి. కథలాపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో కార్యక్రమం ప్రారంభంలో సీఎం ప్రసంగం కొనసాగుతుండగానే రైతులు కుర్చీల్లో నుంచి లేచి వెళ్లిపోయారు. ముందు కూర్చున్న కొందరు అధికారులు, చివరలో ఉన్న కాంగ్రెస్ నాయకులు నలుగురు మాత్రమే పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతుండగా రైతులు లేక ఓదెల రైతు వేదిక వెలవెలబోయింది. ఒకరిద్దరు మినహా రైతులెవరూ దీనికి రాలేదు. జూలపల్లి మండలం తేలుకుంటలోని రైతు వేదిక రైతులు లేక బోసిపోయింది. కార్యక్రమం ప్రారంభం నుంచే వేదిక భవనంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. రైతుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. కేవలం పది మంది మాత్రమే సీఎం ప్రసంగం వినడానికి రావడంతో కార్యక్రమం అబాసుపాలైంది. అలాగే కొత్తపల్లి రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా సీఎం, మంత్రులు మాట్లాడుతున్న సందర్భంలో కొంత సమయం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రైతులు సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్ వెలుగులో సంతకాలు చేయాల్సిన దుస్థితి వచ్చింది.


కొత్తపల్లి రైతు వేదికలో సీఎం మాట్లాడుతుండగా మధ్యలో కరెంటు పోవడంతో చీకట్లోనే రైతులు, రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్న రైతు

## ఇరువైవేలే మాఫీకాలే..


నేను కూలీ పని చేస్త. నాకు మా ఊళ్లో 20 గుంటల భూమి ఉంది. దాని మీద పెద్దపల్లిల 2019 అక్టోబర్‌ల రూ.20 వేల క్రాప్ లోన్ తీసుకున్న. పది రోజుల కిందనే రూ.3000 మిత్తి కట్టిన. నిన్న ప్రకటించిన రుణమాఫీ జాబితాల నా పేరు లేదు. ఏఈవోను అడిగితే నాకు తెలియదన్నడు. బ్యాంకు అధికారులను అడిగితే మాకు తెలువదంటున్నరు. రుణ మాఫీ కాక పోవడానికి కారణాలు వ్యవసాయాధికారులు చెప్తలేరు. బ్యాంకు అధికారులు చెప్తలేరు. ఇరవై వేలే మాఫీ కాలే. ఇక రూ.2 లక్షలు మాఫీ చేస్తామంటే నమ్ముడెట్ల. రేవంత్‌రెడ్డి సర్కారు మాటల గారెడీ చేస్తున్నది.

**- కొయ్యడ కుమార్, రొంపికుంట (కమాన్‌పూర్)**

## రూ.లక్ష లోపు ఉన్నా కాలే


నా పేరు మీద రూ.65 వేలు మాత్రమే పంట రుణం ఉంది. రూ.లక్ష లోపే ఉన్నా రుణమాఫీ కాలేదు. గత ఎన్నికల ముందు మాఫీ అయిన వాళ్ల పేర్లు ఇప్పుడు కూడా ఉన్నాయి. నేను సర్కారు పెట్టిన నిబంధనలకు అనుగుణంగానే ఉన్న. మొదట మాఫీ అయిన వారి పేర్లే మళ్లీ లిస్టులో వచ్చినయ్. రూ.లక్షలోపు రుణం మాఫీ చేస్తారనుకుంటే నేను సంబురపడ్డ. గతంలో చేసిన వారికి కాకుండా మొదట కాని వారికి చేస్తే బాగుండేది. ప్రభుత్వం న్యాయబద్ధంగా రుణమాఫీ చేయాలి.


**- నర్రభగువాన్‌రెడ్డి, రైతు, తుమ్మనపల్లి (హుజూరాబాద్ రూరల్)**

## రేషన్ కార్డుల పేరు లేక మాఫీ కాలే..


నాకు 1.19 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను చెంజర్ల బ్యాంకుల రూ.57 వేలు క్రాప్ లోన్ తీసుకున్న. నాకు మా ఊళ్లో రేషన్ కార్డు ఉండేది. పాత రేషన్ కార్డుల నా పేరుతోపాటు నా భార్య లక్ష్మీకాంత, కొడుకు అశోక్ పేరు ఉంది. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల నా పేరు లేదు. ప్రజాపాలనత దరఖాస్తు కూడా పెట్టుకున్న. రేషన్ కార్డుత పేరు లేకపోవడంతో ఇప్పుడు రుణమాఫీ కాలేదు. నేను దివ్యాంగుడిని. ఆ కనికరమన్నా సర్కారుకు లేకపాయె. నాకు గిట్ల ఎప్పుడు కాలే. జర దండం పెట్టి చెప్తున్న నాకు రావాల్సిన రుణమాఫీ ఎందుకు కాలేదో వాళ్లకే తెల్వాలే.

**- తాటికొండ సత్యనారాయణ, రైతు, చెంజర్ల (మానకొండూర్‌రూరల్)**

## కొర్రీలు పెట్టుకుంట మోసం చేస్తున్నది


నాకు నాలుగెకరాల పైచిలుకు వ్యవసాయ భూమి ఉన్నది. వరి, పత్తి పంట సాగు చేస్తున్న. పంట సాగు కోసం గతేడాది జూన్‌ల ఎలిగేడు బ్యాంక్‌ల రూ.99 వేల క్రాప్ లోన్ తీసుకున్న. కానీ, సర్కారు గురువారం ప్రకటించిన మొదటి జాబితాల నాకు రుణ మాఫీ కాలే. తొలి విడుతల రూ.లక్ష లోపు మాఫీ చేస్తామని చెప్పింది. ఆ లెక్కన నా లోన్ మాఫీ కావాలి. కానీ, ఎందుకు కాలేదో తెలుస్తలేదు. ప్రతి రైతుకు షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలి. కానీ, ఈ సర్కారు కొర్రీలు పెట్టి రైతులను మోసం చేస్తున్నది.

**- చిగురు రవీందర్‌రెడ్డి, రైతు, తేలుకుంట (జూలపల్లి)**

## గందరగోళంగా రుణమాఫీ


రుణమాఫీకి సంబంధించి అధికారులు ఇచ్చిన రుణమాఫీ జాబితా గందరగోళంగా ఉంది. నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను రూ.99 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. రూ.లక్ష లోపు వారికి మాఫీ అని చెప్పిన్రు. కానీ, అధికారులు ఇచ్చిన జాబితాల మా పేరు లేదు. గతంలో కూడా మాకు రుణ మాఫీ కాలే. రూ.2 లక్షల లోపు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు ఎలాంటి నిబంధనలు లేకుండా మాఫీ చేయాలి.

**- అన్నవేణి మహేశ్, రైతు (రుద్రంగి)**



# సంబురాలు సరే.. స్పష్టత ఏది?

**రుణమాఫీ.. గందరగోళం**

- ప్రభుత్వం చెప్పింది ఒకటి.. ఆచరణలో జరిగేది మరొకటి
- రైతులకు అందని సమాచారం
- తమకేమీ తెలియదంటున్న అధికారులు
- అర్హులు మూరెడు.. అందింది బెత్తడు
- ప్రామాణికం ఏంటన్న దానిపై స్పష్టత కరువు
- సమాచారమే లేని సొసైటీలు
- మండిపడుతున్న రైతులు


మేడిపల్లి: రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు, రైతులు, నాయకులు


ఓదెల: రైతు వేదికలో ఖాళీగా కుర్చీలు

**రుణమాఫీలో గందరగోళం నెలకొన్నది. ప్రభుత్వం చెప్పినదానికి ఆచరణలో జాబితాలకు ఏమాత్రం పొంతన లేక రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. గురువారం సాయంత్రంలోగా రూ.లక్ష వరకు రుణం మాఫీ చేస్తామని ఇప్పటికే పలుసార్లు ప్రకటించినా.. సొసైటీలు, తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు సమాచారమే లేకపోవడం ప్రభుత్వ తొందరపాటుకు అద్దం పడుతున్నది. అంతేకాదు, వాణిజ్య బ్యాంకులకు సంబంధించి విడుదలైన జాబితాను పరిశీలిస్తే.. సర్కారు దేనిని ప్రామాణికంగా తీసుకొని రుణమాఫీ వర్తింప చేసిందన్న దానిపై జిల్లా స్థాయిలో ఏ అధికారికీ స్పష్టత లేదు. ఓవైపు లక్ష వరకు రుణమున్న రైతులందరికీ గురువారం సాయంత్రం వరకే వర్తింపజేస్తామని ప్రభుత్వం చెప్పగా.. మరోవైపు సొసైటీలు, గ్రామీణ బ్యాంకుకు సంబంధించిన జాబితా మరి కొద్దిరోజుల్లో వచ్చే అవకాశముందని వ్యవసాయ అధికారులు చెబుతుండడం విస్మయానికి గురి చేస్తున్నది. ఓవరాల్‌గా చూస్తే సంబురాల కోసమే ఈ ప్రక్రియ ఆరంభించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఒక్క అంశంపైనా స్పష్టత లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

**లక్ష వరకు రుణం తీసుకున్న రైతులు, ప్రభుత్వ మాఫీకి సంబంధించి నియోజకవర్గాల వారీగా వివరాలు**

| జిల్లా | లోన్ అకౌంట్స్ | కుటుంబాల సంఖ్య | మాఫీ మొత్తం (రూ. కోట్లలో ) |
|---|---|---|---|
| హుజూరాబాద్ | 14,165 | 13,478 | 73.62 |
| కరీంనగర్ | 2,536 | 2,401 | 12.55 |
| మానకొండూర్ | 15,634 | 14,823 | 81.26 |
| చొప్పదండి | 14,650 | 13,931 | 78.54 |
| మంథని | 12,482 | 11,985 | 67.53 |
| పెద్దపల్లి | 16,616 | 15,605 | 81.08 |
| రామగుండం | 1,990 | 1,928 | 10.66 |
| సిరిసిల్ల | 12,109 | 11,549 | 67.50 |
| వేములవాడ | 11,449 | 11.017 | 65.33 |
| జగిత్యాల | 8,930 | 8,522 | 47.43 |
| కోరుట్ల | 7,030 | 6,750 | 38.81 |
| ధర్మపురి | 18,637 | 17,636 | 94.10 |


కథలాపూర్: రైతు వేదికలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వింటున్న అధికారులు, వెనుకాల ఖాళీగా కుర్చీలు

కరీంనగర్, జూలై 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కరీంనగర్ (నమస్తే తెలంగాణ) : పంట రుణమాఫీకి సంబంధించి ఎన్నడూ లేనివిధంగా ఈసారి గందరగోళం కనిపిస్తున్నది. గతంలో రెండు సార్లు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేసినా.. ఎక్కడ కన్ఫ్యూజన్ కనిపించలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభు త్వం రుణ మాఫీ కోసం పెట్టిన నిబంధనల నుంచి అమలు దాకా అంతా గందరగోళంగా తయారైంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలను పరిగణలోకి తీసుకుంటామని, కుటుంబానికి ఆహారభద్రత కార్డు ప్రామాణికంగా చేస్తామని చెప్పడంతో విమర్శలు రాగా.. నిబంధనలు సడలిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఏ నిబంధనలు సడలించారు? వేటిని ప్రామాణికంగా తీసుకొని లక్ష రుణం మాఫీ వర్తింపజేశారు? దానిపై ప్రభుత్వం తిరిగి కొత్తగా ఉత్తర్వులు జారీ చేయలేదు. దీనిపై అస్పష్టత కొనసాగుతూనే ఉన్నది. గురువారం రుణమాఫీ కోసం ఇచ్చిన జాబితాలోనూ పూర్తి స్థాయిలో స్పష్టత లేదు. నిజానికి ప్రతి గ్రామంలోనూ అర్హుల జాబితా మూరెడు ఉంటే.. మాఫీ వర్తింప జేసింది మాత్రం బెత్తడే' అన్న చందంగా ఉంది. మిగిలిన రైతులకు రుణమాఫీ వర్తిస్తుందా..? లేదా..? అన్నదానిపై ఎవరి వద్దా స్పష్టత లేదు. అలాగే, సహకార సొసైటీల ద్వారా వేలాది మంది రైతులు రుణాలు తీసుకున్నారు. గురువారం విడుదలైన జాబితాలో సొసైటీల ద్వారా రుణం తీసుకున్న రైతుల పేర్లు ఎక్కడా లేవు. అంతే కాదు, సొసైటీలకు కూడా సమాచారం లేదు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి తీసుకున్న రైతుల పరిస్థితి అలాగే ఉన్నది. నిజానికి సొసైటీల ద్వారా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేస్తారా..? చేస్తే ఉత్తర్వులు ఎప్పుడు చేయొచ్చు? జాబితాలో ప్రభుత్వం సదరు రైతులను ఎందుకు అర్హులుగా చేర్చలేదు? అన్న ప్రశ్నలకు ఏ అధికారి వద్దా సమాధానం లేదు. దీంతో రైతుల నుంచి వ్యక్తమవుతున్న ఆగ్రహాన్ని తగ్గించేందుకు రెండు మూడురోజుల్లో మరో జాబితా వస్తుందని స్థానిక వ్యవసాయ అధికారులు చెబుతున్నారే తప్ప.. తాము మరో జాబితా ఇస్తామని ప్రభుత్వం ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ మాత్రం సంబురాల్లో మునిగి తేలింది. తమ రుణం మాఫీ అయిందో.. లేదో.. తెలియక రైతులు ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం సందేహాలను నివృత్తి చేయకుండా సంబురాలు చేసుకోవడం కనిపించింది.

### ఎందుకీ దాపరికం?

రూ.లక్ష వరకు రుణం ఉన్న రైతులకు ముందస్తు సమాచారం లేదు. అంతేకాదు, జాబితా విడుదల నుంచి ప్రదర్శన వరకు అంతా దాపరికమే కనిపిస్తున్నది. ₹లక్ష వరకు రుణ మాఫీ కోసం ప్రభుత్వం జాబితా విడుదల చేసినా.. వాటిని ఎక్కడ కూడా గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించలేదు. అందుబాటులోనూ పెట్టలేదు. చాలా చోట్ల పది పన్నెండు గ్రామాలకు సంబంధించిన జాబితాలను గురువారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత రైతు వేదికల వద్ద అతికించినా.. ఆ సమాచారం కూడా చాలా మంది రైతులకు తెలియకుండా పోయింది. ఇంత గోప్యంగా ఉంచడంపై విమర్శలు వస్తున్నాయి. దీని వెనుక అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ₹లక్ష వరకు రుణమాఫీ చాలా గ్రామాల్లో సగం రైతులకు కూడా వర్తింపు కాలేదన్నది స్పష్టమవుతున్నది. ఈ పరిస్థితుల్లో పంచాయతీల్లో ప్రదర్శిస్తే రైతుల నుంచి వ్యక్తమయ్యే ఆందోళన తట్టుకోవడం సాధ్యం కాదని భావించే.. ఈ రకంగా ప్రభుత్వం వ్యవహరించిందని తెలుస్తున్నది. అంతేకాదు, మెజార్టీ బ్యాంకులకు సమాచారం లేదు. చాలా చోట్ల రైతులు తాము రుణం తీసుకున్న బ్యాంకులకు వచ్చి రుణమాఫీ జరిగిందా..? లేదా..? అని అడిగితే సమాచారం రాలేదని బ్యాంకర్లు చెప్పారు. ఎప్పటి వరకు స్పష్టత రావొచ్చని అడిగితే దానికీ సమాధానం లేదు. బ్యాంకర్లే కాదు, ఏ అధికారి వద్దా స్పష్టత లేదు. ఈ జాబితాలో మిస్ అయిన రైతులను.. తిరిగి మరో జాబితాలో చేర్చి రుణ మాఫీ వర్తింపు చేస్తారా..? లేదా..? ఒక వేళ మరో జాబితా విడుదల చేస్తే అది ఎప్పుడొస్తుంది? ప్రస్తుత జాబితాను నిబంధనలను పరిగణలోకి తీసుకొని చేశారా..? కుటుంబాలు వేరైనా.. పాసుబుక్కులు వేరుగా ఉన్నా.. తండ్రికి రుణ మాఫీ వర్తించి కొడుకులకు ఎందుకు వర్తింప చేయలేదు? తాము తీసుకున్న అసలుకు వడ్డీ ఎంతయింది? అసలు వడ్డీ కలిపి మాఫీ చేశారా..? లేదా..? లక్షన్నర, రెండు లక్షల వరకు రుణాలు తీసుకొని రుణమాఫీకి అర్హులైన జాబితాను పంచాయతీల్లో ఎందుకు ప్రదర్శించడం లేదు? అనేటువంటి అనేక ప్రశ్నలకు ఎవరి వద్దా స్పష్టత లేకుండా పోయింది. అంతా దాపరికం అన్నట్టుగా రుణమాఫీ కొనసాగుతున్న తీరుపై అనేక విమర్శలు వస్తున్నాయి.

**లక్ష వరకు రుణం తీసుకున్న రైతులు, ప్రభుత్వ మాఫీకి సంబంధించి జిల్లాల వారీగా వివరాలు**

| జిల్లా | లోన్ అకౌంట్స్ | కుటుంబాల సంఖ్య | మాఫీ మొత్తం (రూ. కోట్లలో ) |
|---|---|---|---|
| కరీంనగర్ | 37,745 | 35,686 | 194.64 |
| పెద్దపల్లి | 29,725 | 28,080 | 149.43 |
| జగిత్యాల | 39,269 | 37,438 | 207.99 |
| సిరిసిల్ల | 23,986 | 22,963 | 136.36 |
| మొత్తం | 1,30,725 | 1,24,167 | 688.42 |

### 1.24 లక్షల మందికి రుణమాఫీ

తాజా, ఆదేశాల ప్రకారం మొదటి ఫేస్ కింద ఉమ్మడి జిల్లాలో 1,24,167 మందికి రుణమాఫీ వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ₹688.42 కోట్లు మాఫీ చేస్తున్నట్టు సదరు ఆదేశాల్లో ఉంది. అయితే, లక్షలోపు రుణం తీసుకున్న రైతుల సంఖ్య ఉమ్మడి జిల్లాలో రెండున్నర నుంచి మూడు లక్షలకు మించి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలు అమలు చేసి కోతలు పెట్టారా..? లేక ఆహారభద్రత కార్డు ఆధారంగా రుణ మాఫీ వర్తింపజేసి కోతలు పెట్టారా..? అన్నది తేలాల్సి ఉన్నది. విచిత్రం ఏమిటంటే రూ.లక్షలోపు రుణం గురువారమే మాఫీ చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు. ఆయన మాటలను బట్టి చూస్తే గురువారం వచ్చిన జాబితానే ఫైనల్ అనే భావన కలుగుతున్నది. అదే జరిగితే ఒక్కో గ్రామంలో నలభై శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ వర్తించే అవకాశాలు లేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో జాబితా ఇస్తుందా..? రైతుల నుంచి వస్తున్న ఆందోళనను పరిగణలోకి తీసుకొని మిగిలిన అర్హులకు రుణమాఫీ వర్తింప జేస్తుందా..? లేదా..? ఇంతటితోనే చేతులు దులుపుకుంటుందా..? అన్నది తేలాలంటే వేచి చూడాలి.

## ఊరిచ్చి.. ఉత్తదేజేసింద్రు

కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ జేత్తుంద్రని సంబురపడ్డ. ఊరిచ్చి ఉత్తదే జేసింద్రు. మా తాతల నుంచే ఎవుసం జేత్తన్నం. నాకు మూడెకరాల పొలం ఉంది. వరిసాగుజేత్త. పొలం జేసేందుకు పదేండ్ల కింద బ్యాంకుల రూ.లక్ష అప్పుదీసుకున్న. రెండేండ్లకింద మళ్ల ఓ రూ.60 వేలు తీసుకున్న. మొత్తం లక్షా అరవై వేలు ఉంది. ఎంత పనిజేసినా ఇప్పటిదాక అప్పుదీరలే. సీఎం రేవంత్‌రెడ్డి సారు రెండు లక్షల రుణమాఫీ జేత్తనని ఎలక్షన్ల జెప్పిండు.


నిజంగనే మాఫీ జేత్తడనుకొని ఇగ నా బాకీ తీరుద్దని కలలుగన్న. సర్కారోళ్లు ఇచ్చిన రుణమాఫీల నా పేరు లేదట. గింతమాత్రానికి ఓట్లకోసం రుణమాఫీ జేత్తనని ఎందుకు జెప్పాలె. మా అసోంటి పేద రైతులకు ఎందుకు ఆశవెట్టాలె. ఒక్క ఊళ్లె కొందరికిచ్చి, కొందరికి ఇయ్యకపోతె రానోళ్లు ఎంత బాధపడ్తరు. ఒకదిక్కు వానలు లేక మస్తు తక్లిబయితంది. ఇప్పటికే పంటలేసేది ఎయ్యలే. గీ రుణమాఫన్న ఇత్తరనుకుంటే ఉత్తచెయ్యే జూపింద్రు.

**- బండారి పెద్దకురుమ లచ్చయ్య, రైతు, వెంకట్రావుపల్లి (రామడుగు)**

## రెన్యూవల్ చేస్తున్నా మాఫీ కాలే..

సారంగాపూర్‌ల నాకు 3.26 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయమే ప్రధాన వృత్తి. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ల 2020-21లో రూ.లక్ష లోన్ తీసుకున్న. ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకుంటూనే ఉన్న. అప్పు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు ఠంచన్‌గా వడ్డీ


చెల్లిస్తూనే ఉన్న. ఇప్పుడు కేవలం లక్ష రూపాయలు మాత్రమే లోన్ ఉంది. అయినా నాపేరు రుణమాఫీ లిస్ట్‌లో లేదు. ఎందుకు ఇలా జరుగుతుందో నాకు అర్థం కావడం లేదు.. నాకు ఆహార భద్రత కార్డు ఉంది. ఐటీ కట్టడం లేదు. ప్రభుత్వ ఉద్యోగిని కాను. నా కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులు లేరు. అయినా నాకు రుణమాఫీ జరగలేదు.. అధికారులను అడిగినా వారి వద్ద సరైన సమాధానం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి నాకు రుణమాఫీ వర్తించేలా చూడాలి.

**- ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి, రైతు( సారంగాపూర్)**

## లిస్టుల నా పేరే లేదు

రుణమాఫీ కోసం సర్కారు పంపిన లిస్టల నా పేరే రాలే.


నాకున్న మూడెకరాలు రెండు గ్రామాల శివారుల్లో ఉన్నది. దీంతో నాకు రెండు పాస్‌బుక్‌లు వచ్చినయి. 20 గుంటల పాస్‌బుక్‌తో కొలనూర్ పీఏసీఎస్ బ్యాంక్‌ల రూ.24వేలు, 2.20 ఎకరాల పాస్‌బుక్‌తో కనగర్తి బ్యాంక్ ఆఫ్ బరోడాల రూ.75 వేల క్రాప్ లోన్లు తీసుకున్న. కానీ, రుణమాఫీ లిస్ట్‌లో నా పేరు రాలేదని మా భర్త చెప్పిండు. అందరితోపాటు నా పేరు రాకపోవడంతో మాకు మాఫీ వర్తిస్తుందో లేదో తెలుస్త లేదు.

**- జాప ఎల్లవ్వ, మహిళ రైతు, ధర్మారం(కోనరావుపేట)**



పెద్దపల్లి జిల్లా గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

# గ్రూప్-2 వాయిదా వేయాలి

**విద్యార్థి సంఘాల నిరసన**

పెద్దపల్లి టౌన్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ. డీవైఎఫ్ఐ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ మేరకు గురువారం పెద్దపల్లి జిల్లా గ్రంథాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాయకులు జిల్లెల ప్రశాంత్, ఆర్ల సందీప్ మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు మోసపూరిత వాగ్దానాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం డీఎస్సీ పరీక్ష రాస్తున్న క్రమంలో గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలకు హాల్ టికెట్లు ఇవ్వడం, ఒకే తేదీల్లో పరీక్షలు పెట్టడం నిరుద్యోగులను మోసం చేయడమేనని మండిపడ్డారు. నిరుద్యోగులకు అండగా నిలువాలని, వారి మనోభావాలను గుర్తించి ప్రభుత్వం వెంటనే గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నిరసనలో నాయకులు సురేశ్ మౌర్య, సిద్ధార్థ, రోషన్, రాజు, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

# ఆశ కార్యకర్తల కన్నెర్ర

- జగిత్యాలలో నిరసన
- పనిభారం తగ్గించి, జాబ్ చార్ట్ ఇవ్వాలని డిమాండ్
- రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్



జగిత్యాలలో ర్యాలీగా వస్తున్న ఆశ కార్యకర్తలు

జగిత్యాల, జూలై 18: ఆశ కార్యకర్తలు కదం తొక్కారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా నలుమూలల నుంచి కదిలొచ్చి ఆందోళనకు దిగారు. ఆ శాఖ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, ఆశ కార్యకర్తల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు ఆత్మకూరి లత ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు లోనికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోగా, ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వకుండా వెళ్లేదేలేదంటూ కార్యకర్తలు పట్టుబట్టారు. దీంతో జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్, సిబ్బంది కలుగజేసుకుని కార్యాలయానికి కొంత దూరంలో వినతిపత్రాన్ని ఎమ్మెల్యే పీఏకు ఇప్పించారు. పనిభారం తగ్గించి జాబ్ చార్ట్ ఇవ్వాలని, ₹18వేల ఫిక్స్‌డ్ వేతనం చేయాలని, తదితర 23 డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సులోచన మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలతోనే ప్రభుత్వం అన్ని రకాల సర్వేలు చేయిస్తున్నదని, కానీ సరైన జీతాలు చెల్లించడంలేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలు, ఆరోగ్య శాఖ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతోపాటు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షురాలు ఆత్మకూరి లత మాట్లాడుతూ ప్రభుత్వం తమపై అధిక భారం మోపి పనులు చేయిస్తున్నదని, అందుకు అనుగుణంగా ₹18వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకురాలు జయలక్ష్మి మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలంటే చిన్న చూపు చూస్తున్నారని, ప్రసూతి, తదితర పనులన్నీ దగ్గరుండి చేయిస్తున్న తమకు గుర్తింపు లేదని వాపోయారు. ఆదివారంతోపాటు పండుగలకు సెలవులు లేవని ఆశ కార్యకర్తల పరిస్థితి దయనీయంగా ఉందని, వెంటనే డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఇక్కడ జిల్లా కార్యదర్శి రాయికంటి దివ్య, జీవ లక్ష్మి, లావణ్య, వసంత, భాగ్యలక్ష్మి, జయ, ప్రేమలత, మంజుల, సంధ్య, రూప తదితరులు పాల్గొన్నారు.

# ₹కోటి అప్పు చేసి.. కుచ్చుటోపీ

**70 మందిని నమ్మించి నిండాముంచి పరారీ**

మెట్‌పల్లి రూరల్, జూలై 18: అప్పులు, చేబదులు కింద రూ.కోటి దాకా సమకూర్చుకున్న ఓ వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా పరారు కావడం మెట్‌పల్లి మండలంలో కలకలం రేపింది. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎక్స్‌కవేటర్ యజమానిగా చెలామణి అవుతూ గ్రామంలో పలువురి వద్ద అప్పులు చేశాడు. మరికొందరి వద్ద చేబదలు తీసుకున్నాడు. పింఛన్లు పొందే పండుముసలి వాళ్ల నుంచి కూడా డబ్బు తీసుకున్నాడు. ఒక్కొక్కరి వద్ద ₹5 వేల నుంచి ₹పది లక్షల దాకా అప్పు చేశాడు. సుమారు 70 మంది బాధితుల నుంచి రూ.కోటి దాకా సమకూర్చుకున్నాడు. అప్పు ఇచ్చినవారు తిరిగి చెల్లించమని అడిగితే సాకులు చెబుతూ కాలం గడిపాడు. ఎక్స్‌కవేటర్ నిర్వహణతోపాటు నూతనంగా కట్టుకున్న ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు పెరిగిపోవడంతో కొద్ది రోజుల నుంచి గ్రామానికి రాకుండా పరారీలో ఉన్నాడు. దీంతో బాధితులంతా కలిసి గురువారం మహిపాల్ ఇంటికి వెళ్లగా, కుటుంబ సభ్యులు కూడా పరారయ్యారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మోసపోయామని తెలుసుకొని లబోదిబోమన్నారు.


పరారైన వ్యక్తి ఇంటి ఎదుట గుమిగూడిన బాధితులు

# ఉచిత శిక్షణ దరఖాస్తులకు నేడే ఆఖరు

కమాన్‌చౌరస్తా, జూలై 18: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్ సైట్ www.tgbcstudycircle.cgg.gov.in లో ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 75 రోజులపాటు నిర్వహించే శిక్షణ ఈ నెల 22న మొదలవుతుందని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం ₹5 లక్షల లోపు ఉండాలని, ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు ₹5వేల ఉపకార వేతనం అందజేస్తారని చెప్పారు. ఈ ఉచిత శిక్షణ హైదరాబాద్, ఖమ్మంలో ఉంటుందని, వివరాల కోసం 040 24071178 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.